

మధ్యలో కూచుని అష్టావధానం చేస్తూ_ ఆంజనేయులులికి _ మొండి మొలతో మూలలో నిల్చున్న బుజ్జిగాణ్ని చూపించింది శ్రీమతి ఆంజనేయులు, కనీసం ముఖమైనా చూపించకుండా _ ఓ చిరునవ్వన్నా విసరకుండా!

"ఇదో _ పది సార్లు చెప్పాలంటే నాకు సిగ్గు. నేను నిద్రలేచే సరికి నీ ముఖం కనిపించాలి.... నవ్వుతో తెలిసిందా _" పెళ్ళయిన తొలి రోజుల్లో ఆంజనేయులు కోరుకున్న చిన్న కోరిక. తొలి రోజుల్లోనే హరించుకు పోయింది.

"నిద్రపోయే మొగుళ్ళకి నవ్వు ముఖంతో లేపండని ఎవరు చెప్పాలి ఈ ఆడవాళ్ళకు!" ఆంజనేయులు మథన పడ్డాడు,

"అట్లా నా ముఖంలోకి చూస్తారేవిటండీ పిల్లాడికి నీళ్ళు కడగమంటేనూ?" కసురుకుంది కస్తూరీ ఆంజనేయులు.

ఇంత కంటే మంచి మాటలు రావుగా నోటి వెంట. ఖర్మ"—

బుజ్జిగాడిని జబ్బపట్టిలాగి బాల్చీ పక్కన కుదేసి బాల్చీలో చెయ్యి పెట్టాడు. ఎక్కడో అడుగున నీళ్ళు తగిలాయి. ఇదేంటి _ కాకి గులకరాయి కథలాగ దోసెడు నీళ్ళు లేవు!" విసుక్కున్నాడు.

"లేకపోతే ఏవిటండీ, ఈ కొంపలో కొల్లేటి స్నానాలు! కృష్ణా పుష్కరాలూ జరుగుతాయేవిటి? నాలుగు గంటలకి లేస్తే రెండు




బిందెల నీళ్ళు దొరక లేదు. వేరే ఇల్లు చూడండీ అని నెత్తిన నోరు పెట్టుకు మొత్తుకుంటున్నా...."

ఆంజనేయులు రెండు నిమిషాల్లో బుజ్జిగాడి స్నానం ముగించాడు. పిల్లలకి యూనీఫారాలు తొడిగాడు; టీఫిను బాక్సులు సర్దాడు.

లుంగీతోనే బస్టాండు వరకూ వెళ్ళి వాళ్ళను స్కూలుకు సాగనంపి వచ్చాడు. వస్తూనే—

"ఇదో నీళ్ళు పెట్టు_" అన్నాడు అది కార భాషలో.

"నాకే చెంబెడు మిగల్లేదు. మీ బ్యాగ్‌లో తుండు గుడ్డలు పెట్టాను గాని ఈ పూటకి ఆఫీసులో సర్దుకోండి."

ఆఫీసులోనా స్నానం!!

అదంతే.

కాస్త ఆలస్యంగా లేచినా, పంపు దగ్గర కుండలు కుసీ పట్టినా, పంపులు కోపంగా బుసకొట్టినా_ఆంజనేయులు సంచీలోకి తుండు గుడ్డలు దూరతాయి. అందరికన్నా ఓ అర గంట ముందు ఆఫీసు చేరుకుని, విరిగిపోయిన తలుపు చెక్కల్ని అడ్డం పెట్టుకుని ఆఫీసు బాత్‌రూమ్‌లో వొళ్ళు కడిగేసుకుంటాడు. అలా వొళ్ళు కడుక్కునే టప్పుడు కొల్లేటిని జ్ఞాపకం చేసుకుంటాడు.

కొల్లేటి పెనగపిట్టలూ, నీటి కాకులూ ఎంత బావుంటాయని! "మీకూ టయమయింది. చపాతీలు కాయితంలో చుట్టా.



సాయంకాలం వచ్చేప్పుడు ఒక . అర కిలో బఠాణీలు పట్రండి"

ప్యాంటు తొడుక్కుని, సంచీ చేత పట్టుకుని – "తలు వేసుకో" అని, చెండీలు పెట్టుకుంటూ బస్టాండు కొచ్చేసరి పావు గంట పట్టింది. ఆఫీసు బస్ పోయింది.

సూర్యుడు సంజాయిషీ అడుగుతన్నాడు.

స్నానం మాట దేవుడెరుగు. టైం కి ఆఫీసుకు చేరతానో లేదో నన్న పీకులాట మొదలయింది "నాలుగు డ్రిప్పులు – తల కాయలో చెపుకొట్టాయి.

సిటీ బస్సొచ్చింది.

ఒక చేత్తో సంచీనీ, మరో చేత్తో రబ్బరూ పెన్సిలూ, పెన్నూ వున్న షర్టు జేబును గట్టిగా పట్టుకుని బస్సు దగ్గరకు పరుగెత్తాడు.

బెల్లం అచ్చుమీద అతుక్కుపోయిన గండు చీమలా వున్నారు సిటీ బస్సు మీద జనం. రణ రంగంలోకి దూకినట్టు గేటు మీదికి దూకాడు. బస్సులోంచి దిగే ఇలాయి వెధవ లెవరో ఆంజనేయులు రొమ్ము మీద గుద్దుకుంటూ – అభిమన్యుణ్ణి పద్మవ్యూహంలో వదిలేసి బయటపడ్డ గుంపిల్లా – జారుకున్నారు: రధంలాగా బస్సు కదిలింది. పుట్‌పాత్ మీదకొచ్చాడు – పెన్నూ, పెన్సిలు, యింకా వున్నందుకు సంతోషిస్తూ.

బందరు బండిలో అజాకు చేరెడు బఠాణీలు పోసేవాళ్ళు – చిన్న తనంలో. ఏపీ బఠాణీలు, అసలు కనిపించవేం శేరు–అంటే కిలో వుంటాయా? కాలక్షేపం బఠాణీలు – అని అమ్మే వాళ్ళు. లంకల బఠోటు బండి ప్రయాణానికి అవి టానిక్కు బిళ్ళలు: ఆ భావానికి తానే ముగ్ధుడై, చాటుగా కిసుక్కున నవ్వి మూతి తుడుచుకున్నాడు, ఆంజనేయులు.

శ్రీమతి కస్తూరీ ఆంజనేయులు! తెలియదు గానీ ఆంజనేయులుకి అప్పుడప్పుడు చాలా పెద్ద పెద్ద ఐడియాలు వస్తుంటాయి. నస, ఉత్తి ననమనిషి, టిఫిన్లు, రిబ్బన్లు, నవరాలు, లేకపోతే బఠాణీలు, చేగోడీలు, జీడీలు, టాట్– రూరల్ వుమెన్ పట్నం మగాడికి పనికిరాదు. పళ్ళు కొరికాడు:

"హలో ఆంజనేయులు గారో, ఏమిటింకా రోడ్డు మీదే జాగారం ? రాత్రి ఎక్కడ కన్నా వెళ్ళి టీవీ చూశారా: రేటుగా లేచినట్టుంది ". ఎవడో-పది మాటల్లో బతుకంతా బయట పెట్టేశాడే అనుకుని చూశాడు. రామారావు గారు. ఒకప్పుడు యిద్దరూ ఒకే డిపార్టుమెంటులో కొలీగ్స్. హలో అన్నాక–

"అన్నట్టు, ఇల్లు చూశారా? మా ఇంటి దానికేదన్నా చిన్న పాటి ఉద్యోగం...." ఆంజనేయులు పాత ఫైలు కబుర్లు.

రామారావు నవ్వాడు ఎప్పట్లాగానే.

"ఎక్కడండి ఇళ్ళండీ. ఛా. ఛా ఇదివరకు కనీసం "టు లెట్" బోర్డులన్నా కనిపించేవి. ఈ నాలుగేళ్ళల్లో అలాంటి బోర్డు ఒక్కటి కూడా కనిపించందే.... అద్దె కొంప లక్కూడా మినిస్టర్ రికమండేషన్లయితే ఎట్లా చెప్పండి? ఉద్యోగం చూడాలయ్యా. చెపుకి పంపిస్తున్నావా? ఆడ వాళ్ళు ఎకా ఎకిని బియ్యేసి కట్టుకోవచ్చుట: కాస్త ఓపిక పట్టమను" అహా.ఏద్ భయి___ అప్పుడే మలుపు తిప్పిన మోటారు సైకిలును ఆపు జేసి – వెనకాలే కూర్చొని___

"సరే నండి. ఇల్లూ, ఉద్యోగమేగా? నాకు గుర్తున్నాయి. పాపం నాలుగేళ్ళ నుంచి ___" మాటలు ముగించకుండానే "పోనీయి భాయీ" అన్నాడు. రెండు మెలికలు తిరిగి అది రామారావుతోసహా మాయమయింది.

రెండంతస్తుల బస్సు రొప్పుకుంటూ వచ్చింది. దానికి ఒకటే గుమ్మం. ఎక్కేవాళ్ళు. దిగే వాళ్ళు ఆ గుమ్మం మీద కుమ్ముకుంటారు – చస్తే ఎక్క కూడదనుకున్నాడు.



సూర్యుడు మండిపడ్డాడు.

ఎగిరి గంతేసి గుమ్మం ముందు వాలాడు ఆంజనేయులు. భుజంతో తోసుకుంటూ, కడ్డీ పట్టుకుని లోపల కాలు పెట్టాడు. పర్రుమని జేబు చినిగింది:

"ఏవిటండి మీరూనూ.. మరీ చిన్న పిల్లాడిలా జేబు చింపుకుంటారేమిటి: ఎన్ని సార్లు కుట్టను ఒకే జేబుని:"

నిజమంతే. పెన్నూ, పెన్సిలూ వున్న జేబుని పట్టుకుని ఎక్కుతుంటే, ఆ చెయ్యిని పట్టుకుని యింకెవరో వేలాడాలని చూస్తే తోపిడికి షర్టు జేబు పర్రుమంది.

ఆంజనేయులు మనస్సు చివుక్కుమంది–

కసికొద్దీ బస్సు దిగేశాడు.

గబగబా ఓ కిలో మీటరు నడిచి, పరుగెత్తి చిక్కడపల్లి గల్లీలో ప్రవేశించి–

"శేర్ బఠానీ దేవ్–" ఆర్డరు వేశాడు– హైదరాబాదులో సూర్యుణ్ణి లెక్క చెయ్యక పోతే, స్పెషల్ క్యాజువల్ లీవు పెట్టుకోవాలనుకుంటూ:

*

